తనకు మాత్రమే కాదు, ఆయన తల్లిదండ్రులు, అక్కా చెల్లెళ్ళు, అన్నా తమ్ముళ్ళు వాళ్ళ పిల్లలు... పీచులు... సో... ఆన్... ఎందరికో స్థానముంది. అదొక పుష్పక విమానం ఎంతమందికైనా తావిస్తుంది హాయిగా.

# పిలుపు

లల్లలా లాలలా లాలలా లాలలా...

సెల్‌ఫోన్ మోతతో ఉలిక్కిపడ్డాను.

'దేవుడా! అది వాడి నెంబర్ కాకూడదు' మనసులోనే భగవంతుడ్ని ప్రార్థిస్తూ చూశాను. 'తలచినదే జరగదు' అన్న వాక్కును నిజం చేస్తూ... అదే నంబరు.

'ఛీ! ఎన్నిసార్లైనా మోగనీ, ఎత్తకూడదు!' అనుకుంటూ గట్టిగా కళ్ళుమూసుకున్నాను. పోనీ, స్విచ్ ఆఫ్ చేద్దామంటే ఆయనగారి ఫోన్ వస్తుందేమో...' ఆలోచనల్లో కొట్టుకుంటూండగానే దాని మోత ఆగిపోయింది.

కాని ఆగటం మోగేందుకే అన్నట్టుంది. మళ్ళీ మొదలైంది. కోపం, కసి, విసుగు, నిస్సహాయతల మధ్య పెనుగులాడుతూ మొబైల్ చెవికానించుకున్నాను ఓ.కె నొక్కి.

''అక్కా!''

నా పేగుల్ని కదిలించే పిలుపు. అదే ఆత్మీయత. కళ్ళు చిప్పిల్లాయి.

''అక్కా...'' మళ్ళీ... మళ్ళీ.

''ఏంటక్కా! నేనంటే ఎందుకంత కోపం. పెద్దమ్మ వాళ్ళు నీ గురించి ఏమనుకున్నా నాకనవసరం. మా ఇంట్లో మాత్రం అంతా నిన్ను చూడాలని ఆరాటపడుతున్నారక్కా. బావనీ, పిల్లల్నీ ఒప్పించు. నేను కారు తీసు కుని వస్తా...''

''ఒరేయ్...! ఫోన్ పెట్టెయ్‌రా!'' కన్నీళ్ళాగడంలేదు.

''ప్లీజ్... అక్కా!''

''చందూ! ఆలోచించి నేనే ఫోన్ చేస్తా. నన్ను విసిగిం చకు'' వానికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా కట్ చేశాను. మళ్ళీ చేస్తాడేమోనన్న భయంతో స్విచ్ ఆఫ్ చేశాను.

ఒకటా... రెండా... పదిహేడేళ్ళు... కన్నవాళ్ళను, నా అన్నవాళ్ళను, ఉన్న ఊరునూ శాశ్వతంగా వదిలేసి, జిల్లా కాని జిల్లాలో, వందల కిలోమీటర్ల దూరంలో... ఈ పది హేడేళ్ళలో ఒక్కరంటే ఒక్కరు... కనీసం ఎప్పుడైనా పలకరించారా?

ఎన్ని అగ్నిపర్వతాలు బద్దలయ్యాయో
ఎన్ని తుఫానులు చెలరేగాయో
ఎన్ని సునామీలు భయపెట్టాయో
ఎన్ని భూకంపాలకు ఎదురునిల్చిందో...
ఒక్కరైనా అడిగారా?!

ఆయన తోడుంటే చాలు, మిగతా ప్రపంచం బలాదూర్ అనిపించింది. ప్రేమ దెయ్యం పట్టిన ప్రతిరోగి పరిస్థితీ అంతేనేమో! 'ఆయనకోసం నరకానికైనా సిద్ధ'మంటూ వెంటపడి వచ్చాను. కాని 'వనిత తనంత తా వలచి వచ్చిన...' చందమైపోయాను.

ఆయన గుండెల్లో నా స్థానం చెరగనిదనేది కాదన లేని సత్యం. కాని అందులో తనకు మాత్రమే కాదు, ఆయన తల్లిదండ్రులు, అక్కా చెల్లెళ్ళు, అన్నా తమ్ముళ్ళు వాళ్ళ పిల్లలు... పీచులు... సో... ఆన్... ఎందరికో స్థానముంది. అదొక పుష్పక విమానం ఎంతమందికైనా తావిస్తుంది హాయిగా.

అది నాకు సహ్యంకాలేదు. పరిణామం... 'దూరం!' ఆ దూరం ఒక్కోసారి కొలమానానికందనంత పెరిగిపోయినట్లనిపించేది. మాటలస్థాయినీ మించేది. ఎన్ని సార్లు ఆత్మహత్య చేసుకోవాలనిపించిందో!

'శ్రావ్య' తన ప్రాణంతో ప్రాణం పోసుకునేందుకు నా కడుపులోకి ప్రవేశించడం జీవితాన్ని అనుకోని

దొరవేట

## నగ్నంగా!

**జీ**వించటానికేముంది
జీవనం తప్ప...
దుఃఖించటానికేముంది
దుఃఖం తప్ప...
జీవించటానికే దుఃఖం
దుఃఖించటానికే జీవనం
ఆనందం వెదుక్కోమ్మని
జల్సారాయుళ్ళ, తత్వవేత్తల
పరిణామం చెందని శిలలాంటి
మేధావుల
బోధ
అందుకోవటానికి ఆనందమెక్కడుంది
అంతా భ్రమ!
భ్రమలోనే ఆనందముంది!
కళ్ళుమూసుకొని కలలు కనటంలో
ఆనందమే ఆనందం
నేటి స్వప్నాలు రేపటి శత్రువులా!
కొందరి సుఖాన్ని అందరి తలలమీద
పూయకు
ఇక్కడందరూ దుఃఖంలోనే వున్నారు
ఈత కొట్టటానికి ఆనందం ఓ కొలను
కాదనను
ఒడ్డుమీదికి రావాలిగా?
తడిబట్టలతో
లేదా నగ్నంగా!

సిహెచ్.మధు

మలుపు తిప్పింది. ఆ పరిస్థిల్లో అంత పెద్ద కుటుంబంలో మానసిక సమతౌల్యాన్ని సవాలు చేస్తూ జీవించడం ఏరకంగానూ మేలు చేయదని నన్ను దూరంగా ఉంచే శాడు. అది నేటికీ దగ్గరకాలేదు. కోరి కోరి పుట్టింటిని, కోరకుండానే మెట్టి నింటినీ దూరం చేసుకున్న అభాగ్యు రాలినయ్యాను. నేను సర్వస్వమనుకున్న ఆయనైనా నాతోడిదే లోకం అంటాడా? హుఁ! ఆయనెప్పుడూ విదియ నాటి చంద్రుడే.

కళ్ళల్లో వత్తులేసుకొని ఎదురుచూసినంతసేపు పట్టదు కరిగిపోవడానికి. కలలో కనిపించినట్లు వస్తాడు. కళ్ళు తెరవకముందే మాయమౌతాడు. దెబ్బలాడటానికీ టైమెక్కడ? ఉన్నంతసేపూ ప్రతిక్షణం వెలకట్టలేందే. అప్పటికీ ఆవేశాన్నణచుకోలేక తగవుపడ్డా అది నాకే నష్టమని తెలిసొచ్చింది.

అయినా ఏమని దెబ్బలాడాలి? తాగి తన్నడాని కొచ్చాడా? కట్నం కోసం వేధించాడా? ఏదో కావాలని సాధించాడా? కనీసం టీ కూడా అలవాటు లేదు. కులాలు వేరుకావడం, పెద్దలు ఒప్పుకోపోవడంలాంటి అనేక ప్రతికూలతలను ఎదిరించి నన్ను అక్కున జేర్చు కున్నవాడు. ఉద్యోగంతోపాటు తనకు తానుగా క్షణం తీరికలేకుండా మలచుకున్నాడు. ఆయన పరిస్థితి ఒక్కో సారి నాకే జాలి గొలుపుతూంటుంది.

ఎంతసేపుంటేనేం? ఉన్నంతసేపూ ప్రాణంలో ప్రాణంగా లీనమైపోతాడు. పిల్లల ఆనందంకోసం తపి స్తాడు. ఆయన కనిపిస్తే చాలు పిల్లలకు అమావాస్యైనా దీపావళే. ఆయనే ఓసారి ప్రతిపాదించాడు... ''దీపా ల్లాంటి ఈ పిల్లల్ని తీసుకొని ఒక్కసారి మీ అమ్మను కలుద్దాం. ఆమె తప్పకుండా నిన్నాదరిస్తుంది...'' అని.

నాకూ మనసుకొట్టుకుంది. ఎంతైనా కన్నతల్లి కదా. పేగు విలువ నాకూ తెలిసొస్తున్నది. అసలు నాన్న ఉంటే పరిస్థితి ఇట్లా ఉండేది కాదు. ఆయన మనిషెంత సనా తనమో ఆలోచనలంత అధునాతనం. అమ్మది ఉత్తి చాదస్తం. 'కులం-కులం' అంటూ కుళ్ళిపోతూంది. ఆమె నిత్యమూ ఆరాధించే భద్రాద్రి రామయ్య స్వయంగా వచ్చి చెప్పినా... 'నువ్వేంటి ఇట్లా కులభ్రష్టుడిలా మాట్లాడ్తు న్నావ్?' అని నిలదీసే మూర్ఖశిఖామణి. ఇక అన్నలు పేరుకే ఉన్నారు. ఏనాడూ ఈ చెల్లిని గురించి పట్టించుకో లేదు, వాళ్ళు లేరనే ఊహలోనే హాయి. ఈ సంగతులన్నీ ఆయనతో చెబితే...

''జానకీ! ఒక్కసారి ప్రయత్నిద్దాం. పెద్దవాళ్ళకు బాధ ఉండదా? పైకి ఎంత అసహ్యించుకున్నా కని, పెంచిన

ప్రేమ కరిగిపోతుందా? బాధలో వాళ్ళు తిట్టినా అది మనకు ఆశీర్వాదమే అవుతుంది...'' అంటూ నచ్చ జెప్పాడు. ఆయన మాటల బలంతో కొండంత ఆశ ఊపిరిపోసుకుంది.

కాని, అదంతా భ్రమగా మారింది... కల కాదు... పీడకలగా మార్చేసింది అమ్మ... అమ్మ రాక్షసి.

నిజమే! కన్నతల్లిని అంతమాట అనకూడదు. కాని నాకన్నబిడ్డలపట్ల ఆమె చూపిన ప్రవర్తన అట్లా అనిపిస్తుంది మరి. నా మొహం చూసి తలపక్కకు తిప్పుకొని కాండ్రించి ఉమ్మేసింది. నాలుగేళ్ళ శ్రావ్య, రెండేళ్ళ ఆర్య "అమ్మమ్మా...'' అంటూ వెళ్ళి కాళ్ళకు చుట్టుకుంటే...

"ఛీ! ఛీ! వదలండి! ఎవర్రా మీకు అమ్మమ్మ...?'' అంటూ కసురుకొని, గుమ్మంబయటే వాళ్ళను నిలబెట్టి లోపలకెళ్ళిపోయింది. అంతటితో ఊరుకుందా? "ఈరోజెవరిమొగం జూశానో, కులంతక్కువ వాళ్ళను తాకాల్సివచ్చింది...'' అంటూ నానారకాలుగా అరుస్తూ ఆ పిల్లలకి తలా రెండ్రూపాయల బిళ్ళను తాకకుండా చేతిలో వేసి, "పొండి పొండి! ఏ ఊరో ఏం పాడో... ఇంకోసారి ఈ ఛాయలకు రాకండి!'' అంటూ తరిమేసింది.

ఆ క్షణంలోనే ఆ రాక్షసిమీదపడి రక్కేసెయ్యాలన్నంత ఆవేశం కల్గింది. కాని మానాభిమానాల్ని బజారు పాల్జేసుకోవద్దన్న విజ్ఞత, ఆయన సాహచర్యంలో అబ్బిన సంస్కారం నన్నాపని చేయనీయలేదు. ముందు జాగ్రత్తగా ఆ ఇంటి పరిసరాలకు ఆయన్ని రానీయకపోవడం మేలైంది. గుండెల్లోని బాధ బయటికి కనబడనీయకుండా పిల్లల్ని ద్దర్నీ ఎదకు హత్తుకొని, శోకదేవతలా వెనుదిరిగాను.

ఆయన ఎంత ఓదార్చినా మామూలు స్థితికి రావడానికి చాలా సమయమే పట్టింది. అంతా చూసిన అన్నల మౌనం గోరుచుట్టూ-రోకటిపోటు సామెతలా మారింది. అయినా వాళ్ళు అమ్మకే గడగడలాడే భయస్తులు. ఇక అర్థాంగులొచ్చాక భయానికే మారు పేరయ్యారు.

పదమూడేళ్ళనాడు జరిగిన ఆ సంఘటన ఎప్పుడు తలుచుకున్నా నిన్నమొన్ననే జరిగినట్లనిపిస్తుంది. ఆ ఇంటికి కాదుగదా, ఆ ఊళ్ళోకే అడుగుపెట్టనని గట్టిగా శపథం చేశాను. ఇప్పుడీ చందుగాడు ప్రాణాలు తోడేస్తున్నాడు.

పది పన్నెండు రోజుల్నుండీ చెవిలో జోరీగలా తయారయ్యాడు. ఒక్కసారి వచ్చిపొమ్మని, అందరూ అడుగుతున్నారని, బాబాయి (వాళ్ళ నాన్న) కలవరిస్తున్నాడనీ రొద. నాన్న పోయింతర్వాత బాబాయి కూడా నన్ను

## బేగినెగు!

బేగి నెగు!
నువు శానా సదవాల!
మీ తాత బతుకంతా
సాకిరితోటే అరిగింది
నా జీవితం కాడికి
నువు జూస్తూనే ఉన్నావు
నువ్వైనా సదువుకోని
రొంతగేనం సంపాదించుకు
బాగుపడాల!
ఏటి పొద్దున్నే సొద
అని ఇసుక్కోమాకు!
తెల్లారగట్టే సదివితే
బుర్రకెక్కుతాదని
ఆ తాత అనేవోడు
నేను ఇన్లేదు!
మీ తాత నీయంతున్నప్పుడు
ఓ సైకిల్ షాపులో గాలికొట్టేవోడు
ఆడి జనమ బాగుంది
ఓ డాట్రుగారింట్లో పని కుదిరింది
ఈడి బతుక్కి ఆసరా దొరికింది
ఆ బాబు పనికి ఒక సెయ్యి తోడైంది
అప్పుడు ఊరికి ఒక్కరే డాట్రుగోరు
ఊరంతా సల్లంగుండేది
ఈ పొద్దు
ఊర్లో పెతీపేటకీ ఓ ఆసుపత్రి
మరి రోగుల్లేమో
వొయిజాగు పంపేత్తన్నారు!
అయినా
రోగమొచ్చేక ఇక మందేముంది

31

30

రోగాల్లేని బతుకు బతుకు
దానికోసమే సదువు

మా అయ్యమొకాన ఏనాడూ
ఇది లేదనే బాధలేదు
ఇది నాక్కావాలని ఆశలేదు
బతుకు బతకడంలో
నా అయ్యకున్న సుఖం
ఒవురికీ లేదు
ఉప్పుడు నీ మొకాన
మళ్ళా ఆ సంబరం నే సూడాల

ఇయ్యాల నిన్ను
నా రెక్కలు ముక్కలు జేసి
కాన్మెంటు బళ్లో యేసినా గదాని
నాలుగచ్చరాలు సదవడం వస్తే
అదే పదిలచ్చలని
మురిసిపోమాకు

బుఱ్ఱలో బుద్ధి గావాలి గాని
పలకమీద అచ్చరాలూ అంకెలూ గాదు
గాంధీతాత పేరు ఇన్నావు గదా
తెల్లవోళ్ళ చేత పన్జేయించాలంటే
ఈయన తిండి మానేసేవోడు
అంతే!
పొద్దుబోయేసరికల్లా పనైపొయ్యేది.
పట్టంటే అదీ. ఉడుంపట్టు.
సదువు రావాలంటే
అలాటి పట్టుపట్టాల.

అంతేగానీ
సదువంటే మేట్నీ సినేమా గాదు.
సినీమాలో సూపెట్టేదంతా
నిజమని నమ్మేత్తే

నీ బతుకు బుగ్గైపోద్ది.
నీ సరదాకోసరంకాక
పెపంచికంకోసం బతికే బతుకు బతుకు.
దానికోసమే సదువు.

నీకెరుకైన నాలుగు ముక్కలూ
నీకు సెప్తున్నా ఇనుకో.
నిన్ను పలువుగట్టి లాక్కోపోయి
బళ్ళో కూసోపెట్టలేను
నీ సదువు నాను సదవలేను
నీ సదువు నువ్వే సదువుకోవాల
కానీ ఇది గేపకవెట్టుకో
నువ్వు సదువుకోవాలంటే
గుంటడిగానే సాగుద్ది.
ఇప్పుడొగ్గేసి నా అంత్తైనాక
సంసారంలో సేపలా కొట్టుకుంటూ
సదువు కావాలన్నా
ఆ అప్పన్నగ్గూడా వొల్లగాదు.

ఏ పొద్దు పని ఆ పొద్దును జేస్తూ
పెతీపొద్దూ సంబరంగా
బతికే బతుకు బతుకు
దానికోసమే సదువు

డివిఆర్‌కె.శాస్త్రి

ఎంతో అపురూపం చేసేవాడు.

ఆయనకు ఆలస్యంగా వీడు కలిగాడు; ఒకే ఒక్కడు. ఈ రెండు కారణాలూ నామీద అపారమైన ప్రేమకురిపించేలా చేశాయి. ప్రేమ పంచడానికి సొంత రక్తమే అవసరం లేదన్న నిజానికి తార్కాణం బాబాయి.

బాబాయిని తలచుకునేసరికి ప్రాణం గొంతులో కొచ్చింది మళ్ళీ. 'అవును, వెళ్ళాలి! శ్రీవారిని, పిల్లలనూ వెంటబెట్టుకొని దర్జా వెలగబోస్తూ వెళ్ళాలి.

ఇప్పుడా ముసిల్దానికి (మా అమ్మకి) కాళ్ళూ, కళ్ళూ డీలాపడి పోయి ఉంటాయి. అయినా ఆవిడ దేంట్లో

గొప్ప? చదువులో, గుణంలో, స్థాయిలో మావారి గోటిక్కూడా సరి రారు వాళ్ళు. నా కొడుక్కి రెండ్రూపాయలు ముష్టివేసింది కదా! ఇప్పుడు వాని చేత్తోనే వంద రూపాయలు ఇప్పించి 'ఆకూ వక్కా కొనుక్కో' అనిపించాలి... ఏవో ఆలోచనలు... అర్థంలేనివి అర్థం కానివి... అలసిన మనసు శరీర ఆరామంలో విశ్రాంతి కోరుకున్నట్టుంది. కళ్ళు మూతలు పడ్డాయి.

❖ ❖ ❖

''జాగ్రత్త! నా భయమంతా నీ గురించే. అనవసరంగా ఆవేశపడకు. అక్కడ ఏమాత్రం అసౌకర్యం అనిపించినా ఫోన్ చేయి. ముందుగా చెబితే నేనూ వచ్చేవాణ్ణి కదా...'' మృదువుగా జాగ్రత్తలు చెప్పి, వీడ్కోలిచ్చారు శ్రీవారు.

పంతం నెగ్గించుకున్న చందూ ఏసీ కారును ఎనభై కిలోమీటర్ల వేగంతో తోలుతున్నాడు.

పిల్లలిద్దరికీ ఆ అనుభవం చిత్రంగా, సంతోషంగా ఉంది. అంతంలేని ప్రశ్నలతో చందూని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. చందూ కూడా ఓపికగా వాళ్ళ ప్రశ్నలకు తగిన జవాబులను వివరంగా చెబుతున్నాడు.

అవన్నీ వింటూంటే నేనే చిన్నపిల్లనైపోయాను ఇక వాళ్ళ సంగతి వేరే చెప్పాలా? మా ఊరి సంగతులన్నీ భూత భవిష్య ద్రూపాలలో దృశ్యాదృశ్యాలుగా కళ్ళ ముందు కదులుతున్నాయి. నాలుగ్గంటల ప్రయాణం ఎట్లా పూర్తయ్యిందో తెలియనేలేదు. మేం కొత్తూరు చేరేసరికి రాత్రి ఎనిమిదయ్యింది.

గొప్ప స్వాగత సత్కారాలేం జరగలేదు. నేనూహించలేదు కూడా. పిన్ని నన్ను చూడగానే కళ్ళనీళ్ళు పెట్టుకుంది. నాకూ దుఃఖమాగలేదు. కోడల్నీ మనవల్నీ పేరు పేరునా పరిచయం చేసింది. బాబాయి మంచానికి అతుక్కుపోయి ఉన్నాడు. ఆయన్ని చూస్తే చివరిరోజుల్లో ఉన్న నాన్న కళ్ళలో మెదిలాడు. చిన్నపిల్లలా ఏడ్చేశాను. నా తల నిమురుతూ, కన్నీళ్ళతోనే ఆశీర్వదించాడు బాబాయి. మమ్మల్నక్కడ దించిన చందూ మళ్ళీ కనబడలేదు.

మరుసటిరోజు ఉదయం అమ్మ గురించి అడిగాను పిన్నిని.

''ఆమె సంగతి ఎందుకులే బిడ్డా. ఏమాత్రం మారలేదు. మారదు కూడా. మిమ్మల్ని తీసుకొస్తున్నానని చందూ వెళ్ళి చెప్తే, 'పోయినోళ్ళ' గురించి నా దగ్గర ఎత్తొద్దు' అంటూ తిట్టిపోసిందట. పోన్లేవే... ఎవరి మానాన వాళ్ళు పోతారు. ముత్యాల్లాంటి బిడ్డల్ని కన్నావు. వాళ్ళను చూసుకుంటూ హాయిగా గడిపెయ్...'' హితవు చెప్పింది ఆమె.

అమ్మ పట్టుదల చూస్తే ఒక్కోసారి ముచ్చటేస్తుంది కూడా. ఈ అజ్ఞానమే లేకపోతే ఆమె ఎంతో గొప్పదయ్యేది అనిపిస్తుంది. కాని హృదయం అట్టడుగున 'అమ్మ' పేరెత్తితే ఊరే చెమ్మ మాత్రం ఇంకిపోయింది. ఇంక అక్కడ ఉండటం కూడా అనవసరమనిపించింది. పిన్ని కుటుంబం నుంచి లభించిన ఆదరణా మమ్మల్ని కట్టిపడేసేంత గొప్పదేం కాదు. 'ఎద్దుపుండు-కాకి' సామెతలా మమ్మల్ని చూసిన వాళ్ళంతా ఏవో పాడుపు ప్రశ్నలతో గాయపరచడానికే కంకణం కట్టుకున్నట్టు మాట్లాడటం అశాంతిని పెంచసాగింది.

రావద్దనుకున్న ఊరికి రావడమే పొరబాటు. చూడొద్దనుకున్న మనిషిని చూడాలనే ఆశకూడా కొడిగట్టింది.

## విశ్వం

విశ్వపు హృదయం
ఉదయం...
మనసంతా వెన్నెలే
ఆలోచనా సముద్రంలో
బడబాగ్నులు తుఫాన్లు
వుండనే వుంటాయి
రంగు చేపల
రమణీయతలు కూడాను...

## పతంజలి!

మరో సాహితీ సుమం
రాలిపోయింది
భూమ్యాకాశాలు
తెల్లబోయి చూస్తున్నాయి
తెలుగు సాహితీలోకం
కన్నీరు మున్నీరైంది
పతంజలీ!
నీకు నా భాష్పాంజలి!!

గుడిమెట్ల గోపాలకృష్ణ

బాబాయి కుటుంబాన్ని పరామర్శించడమూ అయిపోయింది. ఇంకా ఇక్కడుండటం అనవసరం అనిపించింది. మేం వచ్చేంతవరకు చంపుకుతిన్న చందూ మమ్మల్నిక్కడ చేర్చడంతోనే 'చిక్కడూ-దొరకడు'లా మారిపోయాడు. పదిసార్లు ఫోన్లో మందలిస్తే చివరికా రోజు రాత్రి వచ్చాడు. మమ్మల్ని పంపించేసెయ్యి మని అడిగాన్నేను.

వాడు రెండు చేతులూ జోడించాడు. "అక్కా! ఈ ఒక్కరోజూ ఓపికపట్టు. రేపే పోలింగ్. నా ప్రాణస్నేహితుడొకడు సర్పంచ్‌గా కాంటెస్ట్ చేస్తున్నాడు. ఆ పనిలో బిజీగా ఉన్నాను. ఎల్లుండి బంగారుమైసమ్మ దగ్గర పార్టీ. అక్కడికి మనవాళ్ళందరూ వస్తారు.

పెద్దమ్మను ఎట్లా బుట్టలో వేస్తానో, ఈ మనవడ్నీ, మనవరాల్నీ ఆమె దగ్గరక తీసుకునేట్టు ఎట్లా చేస్తానో నువ్వే చూస్తావు గదా!"

వాని మాటల్తో ఏదో ఆశ మళ్ళీ రెపరెప. వీడు మహా కాలాంతకుడు. తలచుకుంటే అన్నంతపనీ చేస్తాడు. అయినా పసివాళ్ళ మొహాలు చూస్తే కరగని మనిషి. ఏమో... నమ్మకం కుదరడంలేదు. నేన ఆలోచనల్లో సతమతమవుతూండగానే చందూ అదృశ్యం మళ్ళీ.

❖ ❖ ❖

తిరుగుప్రయాణం... బస్సులో.

గుండె మండిపోతూంది.

నరాలన్నీ చిట్లిపోయేలా ఏడవాలనిపిస్తుంది.

దుఃఖాన్ని అదిమిపట్టినా కన్నీళ్ళకు అడ్డుకట్టవేయలేకపోతున్నా.

రాజకీయాల్లో శాశ్వత శత్రువులూ, శాశ్వత మిత్రులూ ఉండరంటారు కానీ, అసలు ఏ బంధానికీ సంబంధంలేనిదే రాజకీయం. ఛీ! ఛీఛీ! నా బలహీనతను ఎంత బాగా వాడుకున్నాడా దుర్మార్గుడు! ఆ చందూగాడ్ని కనిపిస్తే పీక నులిమి చంపేయాలన్నంత కసి పెరుగుతోంది. అందుకేనేమో కనిపించడం మానేశాడు. ఏరు దాటగానే మా మానాన మమ్మల్ని వదిలేశాడు. నీచుడు! కుక్క! థూ! ఎన్నిరకాలుగా తిట్టినా తక్కువే. "అక్కా!" అంటూ నక్కప్రేమ ఒలకబోసి ఎంత దగా చేశాడు. నిన్నటిదాకా వాడాడిన నాటకం పసిగట్టకుండా ఎంత బాగా మేనేజ్ చేశాడు!

మొన్న ఉదయం "ఓటువేసివద్దాం రండి వదినా!" అంటూ మరదలడగటం ఆశ్చర్యాన్ని కలిగించింది. అందులోంచి తేరుకోకముందే శ్రావ్యకూ ఓటు ఉందంటూ మరోషాక్ ఇచ్చింది ఆవిడ.

> రాజకీయాల్లో...
> శాశ్వత శత్రువులూ, శాశ్వత మిత్రులూ ఉండరంటారు కానీ,
> అసలు ఏ బంధానికీ
> సంబంధంలేనిదే
> రాజకీయం.

"నా ఓటు టంగుటూరులోనే ఉంది. శ్రావ్యకింకా ఓటు హక్కురాలేదు. అయినా ఓటు ఒకే చోట వినియోగించుకోవాలి..." అంటూ నా వ్యతిరేకత తెలియజేశాను.

అప్పుడు ఫోన్లో ఈ ప్రబుద్ధుడు... "అక్కా! మా అదృష్టంకొద్దీ ఈరోజు మీరిక్కడున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో ప్రతి ఓటూ ఎంతో విలువైంది. కాదనకక్కా. ఈ తమ్ముడి కోసం ఆ మాత్రం చేయలేవా? పోలింగ్ స్టేషన్‌లో ఏ సమస్యా ఎదురుకాదు..." అంటూ ఏమేమో చెప్పాడు.

'నిజమే. ఇంతదూరం వచ్చాం. న్యాయమో అన్యాయమో, మనవాళ్ళకి మేలు జరుగుతూంటే ఈ మాత్రం రిస్క్ తీసుకోవడం తప్పేంకాదు' అనిపించింది. కాని, తర్వాత ఆలోచిస్తే, అసలు ఈ పనిసాధించడంకోసమే పనిగట్టుకొని మమ్మల్ని అక్కడ్నుండి తీసుకొచ్చాడని క్రమంగా అర్థమైంది నాకు. అంతే! మొదటిసారి చందూగాడిమీద అసహ్యం కలిగింది.

ఓటువేసిన మరుక్షణం అక్కడుండటం నిప్పులమీద నిలబడ్డ అనుభూతిని కలిగించసాగింది. అందుకు తగ్గట్టు ఆ నిముషం నుండి చందూ కనిపించనేలేదు. ఫోన్‌లో ప్రయత్నమూ ఫలించలేదు. చేసిన ప్రతిసారి ఎవడో కోన్‌కిస్కాగాడు ఎత్తడం, పొంతనలేని జవాబులు చెప్పడం.

ఆ సాయంత్రమే వాని ఫ్రెండు ఒక్క ఓటుతో గెలిచాడన్న వార్త తెలిసింది. ఊళ్ళో సంబరాల గోల. మరుసటి రోజు అమ్మను కలిపిస్తానన్న మనిషి ఈరోజు ఈ క్షణం దాకా మొహం చూపలేదు.

ఆరోజు అమ్మచేసిన అవమానం వెనకున్న ఆవేదన అర్థం చేసుకోదగిందే. కాని, ఈరోజు వీడుచేసిన దగా, జీవితంలో ఎన్నడూ క్షమించలేనిది.

'జానకీ! అసౌకర్యమనిపిస్తే ఫోన్ చెయ్...' ఆయన గుర్తుకొచ్చారు. టకటకా నెంబరు కలిపాను.

"జానకీ!"

ఎడారిలో విలవిల్లాడుతున్న దానికి చల్లని అమృత ధారలాంటి ఆ పిలుపు, ఒంట్లోని బాధనంతా తోడేయసాగింది. ■